ఏళ్ల సమస్యకు శాశ్వత పరిష్కారం

- బ్రిటీష్ హయాంలో భూములకు హద్దులు
- శతాబ్దం తర్వాత భూముల రీసర్వే
- ఆధునాతన పరిజ్ఞానంతో కొలతలు
- మండలంలో 12 గ్రామాల్లో భూముల రీ సర్వే పూర్తి



మరుపూరు గ్రామానికి చెందిన ఈ రైతు పేరు వేణుంబాక చంద్రశేఖర్ రెడ్డి. ఆ గ్రామంలో 6 వేల ఎకరాల పైచిలుకు భూములు ఉన్నాయి. గ్రామంలో భూముల రీ–సర్వే పూర్తయ్యింది. ఎన్నో ఏళ్లగా సమస్యలు ఉన్న భూములకు రీ–సర్వే వల్ల పరిష్కారం లభించిందని రైతు వెల్లడించారు. సర్వేలో చిన్నపాటి తప్పులు ఉన్నా అప్పీలు చేసుకునే అవకాశం ఉందని వెల్లడించారు. ప్రభుత్వం చేపట్టిన రీ–సర్వే వల్ల రైతులకు ప్రయోజనం ఉందని తెలిపారు.



ఊసపల్లి గ్రామానికి చెందిన ఈ రైతు పేరు కొత్తలూరు కోటేశ్వరరావు. ఈయనకు మెట్ట భూములు బాగానే ఉన్నాయి. ఊసపల్లి గ్రామంలో రెండోవిడతలో రీ–సర్వేను అధికారులు పూర్తి చేశారు. గ్రామంలో 784 ఎకరాల ప్రభుత్వ, రైతుల భూములు ఉన్నాయి. సర్వేలో ఎలాంటి లోటుపాట్లు లేవని, పట్టాదారు పాసు పుస్తకాలు అందజేయాల్సి ఉందని రైతు వెల్లడించారు. భూముల రీ–సర్వేతో రైతులకు ప్రయోజనకరంగా ఉందన్నారు.



ఊసపల్లిలో హద్దురాళ్లు నాటుతున్న ప్రక్రియను పరిశీలిస్తున్న జేసీ కూర్మనాథ్ (ఫైల్)

పొదలకూరు : వందేళ్ల తర్వాత ప్రారంభమైన భూముల రీసర్వే సత్ఫలితాలను ఇస్తోంది. దేశంలోనే తొలిసారిగా ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం వైఎస్సార్ జగనన్న శాశ్వత భూహక్కు, భూరక్ష పథకం కింద భూముల రీసర్వేను చేస్తోంది. గతేడాది కొన్ని భూములను ఆధునాతన సాంకేతిక పరిజ్ఞానంతో విజయవంతంగా సర్వే చేయించింది. మండలంలో మూడు విడతలుగా మొత్తం 12 గ్రామాలను ఎంపిక చేసి సర్వేను పూర్తి చేశారు. మరో నాలుగు గ్రామాల్లో సర్వే జరుగుతోంది. సర్వే జరిగిన, జరుగుతున్న గ్రామాలకు తరచుగా జాయింట్ కలెక్టర్, నెల్లూరు ఆర్డీఓలు పరిశీలిస్తున్నారు. సజావుగా సర్వేను నిర్వహించేందుకు ఉన్నత స్థాయి అధికారులు సలహాలు, సూచనలు చేస్తున్నారు. సర్వే పూర్తయిన గ్రామాల్లో



డ్రోన్ ద్వారా చేపడుతున్న సర్వే (ఊహా చిత్రం)



సర్వే తర్వాత అందించే పట్టాదారు పాసుపుస్తకం

భూహక్కు పత్రాలను అందజేసేందుకు సిద్ధం చేస్తున్నారు. మండలంలోని ఊట్లపాళెం గ్రామంలో భూహక్కు (పట్టాదార్ పాసుపుస్తకాలు)పత్రాలను పంపిణీ చేశారు. పొరపాట్లు ఉంటే సరిదిద్దేందుకు సంబంధిత రైతులకు అవకాశం ఇస్తున్నారు.

ప్రతి కమతానికి ఐడీ నంబరు

రైతులకు సంబంధించిన భూ హద్దులు, దారి గొడవలు ప్రధాన సమస్యలుగా ఉన్నాయి. ఈ నేపథ్యంలో రీ–సర్వేలో అక్షాంశ, రేఖాంశాల ఆధారంగా ఆధునాతన టెక్నాలజీ ద్వారా మార్కింగ్ ఇచ్చి ప్రతి కమతానికి గుర్తింపు నంబరు ఇస్తున్నారు. ఆయా గ్రామాల్లో సర్వే నంబరు–1 నుంచి కొత్తగా సర్వే నంబర్లను ఇస్తూ సర్వే పూర్తయిన తర్వాత గ్రామసభ నిర్వహించి పాసుపుస్తకాలను అందజేస్తున్నారు. గ్రామాల్లో ప్రభుత్వ, ప్రైవేటు భూముల సర్వేతో పాటు, గ్రామకంఠం భూములను కూడా సర్వే చేయిస్తున్నారు. మండలంలో మొగళ్లూరు 2,838.68 ఎకరాలు, నందివాయ 728.44 ఎకరాలు, అంకుపల్లి 1639.57, బత్తులపల్లిపాడు 695.93, చాటగొట్ల 764.39, గురవాయపాళెం 868.34, ఊట్లపాళెం 1,402.18, ఊసపల్లి 784.72, మర్రిపల్లి 1,002.60. పార్లపల్లి 1,466.09, వెలికంటిపాళెం 945.58, మరుపూరు 6,285.40 ఎకరాల్లో రీ–సర్వేను పూర్తి చేశారు. డేగపూడిరాజు 65.47, పులికల్లు 3,491.77, నల్లపాళెం 1,591.62, మహ్మదాపురం 2,133.92 ఎకరాల్లో సర్వే జరుగుతోంది. ఈ గ్రామాల్లో గ్రామహద్దుల ఏర్పాటు, ప్రభుత్వ భూముల సర్వే, గ్రౌండ్ ట్రూతినింగ్(రైతును పక్కన పెట్టుకుని సర్వే నిర్వహించడం) జరుగుతోంది. మండలంలో మొత్తం 36 రెవెన్యూ విలేజ్‌లు ఉండగా ఇప్పటి వరకు 12 విలేజ్‌లలో సర్వేను పూర్తి చేశారు.

రీ సర్వేతో ఎంతో ఉపయోగం



భూముల రీ–సర్వే వల్ల రైతులకు ఎంతో ఉపయోగం ఉంది. సాదాబైనామా భూములకు కూడా పరిష్కారం లభిస్తోంది. లోటుపాట్లు ఉంటే అప్పీలు చేసుకునే అవకాశం కూడా ఉంది.

– వై.పెంచలరెడ్డి, రైతు, పులికల్లు

శతాబ్దం తర్వాత సర్వే



బ్రిటీష్ హయాంలో భూముల సర్వే జరిగింది. ఈ మధ్య కాలంలో అనేక సమస్యలు వచ్చాయి. సమగ్ర భూసర్వే వల్ల సమస్యలు తొలగిపోతున్నాయి. అయితే సర్వే తర్వాత ఎలాంటి సమస్యలైనా అధికారులు పరిష్కరించగలిగేలా ఉండాలి.

– కె.కృష్ణారెడ్డి, రైతు, మహ్మదాపురం

వివాదాలు లేకుండా చేస్తున్నాం



ఎంపిక చేసిన గ్రామాల్లో ఎలాంటి వివాదాలు లేకుండా భూముల సర్వే చేపడుతున్నాం. చిన్నపాటి సమస్యలు ఉంటే అధికారుల ద్వారా పరిష్కరించి సర్వేను పూర్తి చేయగలుగుతున్నాం. హద్దురాళ్లను కూడా నాటి రైతుల మధ్య వివాదాలు రాకుండా జాగ్రత్తలు తీసుకుంటున్నాం.

– ఎల్.వెంకటేశ్వర్లు, మండల సర్వేయర్, పొదలకూరు

అప్పీల్‌కు అవకాశం ఉంది



సమగ్ర భూముల రీ–సర్వేలో పొరపాట్లు నెలకొంటే అప్పీల్ చేసుకునేందుకు అవకాశం ఉంది. ఇందుకోసం రెవెన్యూ అధికారులు నిరంతరం పనిచేస్తున్నారు. ఒకటి, రెండు గ్రామాల్లో సమస్యలు వచ్చినా రైతులకు వివరించి సర్దుబాటు చేస్తున్నాం. ఆధునాతన సాంకేతిక పరిజ్ఞానంతో సర్వే చేయడం వల్ల ఎక్కడా తేడా ఉండదు.

– ఐఎస్ ప్రసాద్, తహసీల్దార్, పొదలకూరు

క్లుప్తంగా

సాయినాథునికి విశేష పూజలు



ప్రత్యేకాలంకరణలో బాబా

పొదలకూరు : పట్టణంలోని శిరిడీ సాయిబాబా మందిరంలో అర్చకులు గురువారం విశేష పూజలు నిర్వహించారు. ఉదయం అభిషేకాలు, అష్టోత్తర, సహస్రనామ పూజలు, మధ్యాహ్నం భక్తులకు అన్నదాన కార్యక్రమం ఏర్పాటు చేశారు. శాశ్వత ఉభయకర్తల గోత్ర నామాలతో పూజలు, సాయంత్రం భజనలు, రాత్రి పల్లకిసేవ గావించారు. శేజ్‌హారతితో పూజా కార్యక్రమాలు ముగిశాయి.

సొసైటీ గోదాము ప్రారంభం

కోవూరు(విడవలూరు) : మండలంలోని ముదివర్తి సొసైటీ పరిధిలో రూ.24.45 లక్షలతో నిర్మించిన గోదామును కోవూరు ఎమ్మెల్యే నల్లపరెడ్డి ప్రసన్నకుమార్‌రెడ్డి గురువారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇప్పటికే సొసైటీ పరిధిలో గోదాముల నిర్మాణం వేగవంతంగా సాగుతున్నాయన్నారు. కార్యక్రమంలో నేతలు నవీన్‌కుమార్ రెడ్డి, అచ్యుత్‌రెడ్డి, విజయభానురెడ్డి, సొసైటీ చైర్మన్ కొండూరు లక్ష్మీనారాయణరెడ్డి, మండల ఉపాధ్యక్షురాలు సౌందర్య, సర్పంచ్ నిర్మలమ్మ తదితరులు పాల్గొన్నారు.

అనుమానాస్పద స్థితిలో వ్యక్తి మృతి

నెల్లూరు రూరల్: అనుమానాస్పద స్థితిలో వ్యక్తి మృతి చెందిన ఘటన ఇందిరమ్మ కాలనీలో గురువారం చోటు చేసుకొంది. రూరల్ పోలీసుల కథనం మేరకు.. తమిళనాడుకు చెందిన గోవిందరాజ్ (50) కొంత కాలంగా ఇక్కడ నివసిస్తూ వివిధ ప్రాంతాల్లో సెక్యూరిటీ గార్డుగా పనిచేస్తున్నారు. అతనికి ఆహారాన్ని చుట్టుపక్కల వారు అందించేవారు. సమీపంలోని వారు ఆహారం తీసుకెళ్లగా, ఇంట్లో ఆయన కనిపించలేదు. మరుగుదొడ్లో మరణించి ఉండటాన్ని స్థానికులు గుర్తించారు. రూరల్ పోలీసులకు ఫిర్యాదు అందడంతో ఘటన స్థలానికి చేరుకొని పరిశీలించారు. పోస్ట్‌మార్టం నిమిత్తం మృతదేహాన్ని జీజీహెచ్‌కు తరలించారు. రూరల్ పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

అల్లీపురంలో చోరీ

నెల్లూరు రూరల్: అల్లీపురం సమీపంలోని మేకలవారితోటలో చోరీ జరిగింది. వివరాలు.. మేకలవారితోటకు చెందిన కామాక్షి దంపతులు కూలీ పనులు చేస్తుంటారు. పనులకెళ్లి గురువారం సాయంత్రం ఇంటికొచ్చిన వారు తాళం పగలగొట్టి ఉండటాన్ని గుర్తించారు. ఇంట్లోకి వెళ్లి పరిశీలించగా, తొమ్మిది గ్రాముల బంగారు, వెండి వస్తువులు చోరీకి గురయ్యాయని నిర్ధారించుకున్నారు. ఘటనపై రూరల్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

గాయపడిన వృద్ధుడి మృతి

నెల్లూరు(క్రైమ్): గుర్తుతెలియని వాహనం ఢీకొనడంతో తీవ్రంగా గాయపడి ఆస్పత్రిలో చికిత్స పొందుతూ వృద్ధుడు మృతి చెందారు. సౌత్ ట్రాఫిక్ పోలీసుల సమాచారం మేరకు.. నూతన జెడ్పీ కార్యాలయ ఎదురుగా గత నెల 19న గుర్తుతెలియని వాహనం ఢీకొనడంతో తీవ్రంగా గాయపడిన చాన్‌బాషా (60) రోడ్డుపై పడిపోయారు. అటుగా వెళ్తున్న వీఆర్వో బాషయ్య గమనించారు. వృద్ధుడి వివరాలను ఆరాతీయగా.. తనది బోగోలు మండలం ముంగమూరు అని చెప్పి స్పృహ కోల్పోయారు. చికిత్స నిమిత్తం 108 ద్వారా జీజీహెచ్‌కు తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ బుధవారం అర్ధరాత్రి మృతి చెందారు. వీఆర్వో ఫిర్యాదు మేరకు సౌత్ ట్రాఫిక్ ఎస్సై అబ్దుల్ రహీమ్ కేసు దర్యాప్తు చేస్తున్నారు.

త్వరితగతిన రీ సర్వే పూర్తి

నెల్లూరు(బారకాసు): వైఎస్సార్ జగనన్న శాశ్వత భూ హక్కు, భూ రక్ష పథకంలో భాగంగా నగరపాలక సంస్థ పరిధిలో అత్యాధునిక డ్రోన్ సేవలను వినియోగించి రీ సర్వేను త్వరితగతిన పూర్తి చేయాలని కమిషనర్ వికాస్ మర్మత్ ఆదేశించారు. డ్రోన్‌తో రీ సర్వేను నగరంలోని పోలీస్ పరేడ్ గ్రౌండ్స్‌లో నగరపాలక సంస్థ పట్టణ ప్రణాళిక విభాగాధికారులు, డ్రోన్ ఏజెన్సీ బృందంతో కలిసి గురువారం ప్రారంభించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడారు. నగరపాలక సంస్థ పరిధిలోని 154 చదరపు కిలోమీటర్ల మేర సర్వేను చేపట్టనున్నామని తెలిపారు. ఆస్తి కలిగిన ప్రతి ఒక్కరికీ రీ సర్వే ఆధారిత శాశ్వత భూ హక్కు పత్రాలను అందజేస్తామని వివరించారు. కార్యక్రమానికి సహకరించేలా ప్రజలకు అవగాహన కల్పించాలని సూచించారు. కార్యక్రమంలో డిప్యూటీ కమిషనర్ చెన్నుడు, డ్రోన్ ఏజెన్సీ నిర్వాహకుడు కృష్ణచైతన్య, తదితరులు పాల్గొన్నారు.

విధి నిర్వహణలో అప్రమత్తంగా ఉండాలి



అవగాహన కల్పిస్తున్న అధికారులు

ముత్తుకూరు : విధి నిర్వహణలో విద్యుచ్ఛక్తి పట్ల ప్రతిఒక్కరూ అప్రమత్తంగా ఉండాలని డిప్యూటీ చీఫ్ ఇన్‌స్పెక్టర్ ఆఫ్ ఫ్యాక్టరీస్ శైలేంద్రకుమార్ అన్నారు. నేలటూరులోని శ్రీదామోదరం సంజీవయ్య ఏపీజెన్‌కో ప్రాజెక్టులో గురువారం కార్మికులకు అవగాహన సదస్సు జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, భద్రత ప్రమాణాలు పాటించడం ద్వారా ప్రమాదాలను నివారించవచ్చని తెలిపారు. విద్యుత్ మరమ్మతులు, పరీక్షలు చేసే విషయంలో పాటించాల్సిన జాగ్రత్తలు, చర్యలను విపులంగా వివరించారు. మాక్‌డ్రిల్ ద్వారా నివారణోపాయాలను తెలియజెప్పారు. విద్యుత్ విభాగ ఇంజినీర్లు, భద్రతాధికారులు పాల్గొన్నారు.

గ్రామాల్లో రెవెన్యూ సదస్సులు ప్రారంభం



అర్జీని స్వీకరిస్తున్న తహసీల్దార్ సుధీర్



పొదలకూరు : మాట్లాడుతున్న తహసీల్దార్

బుచ్చిరెడ్డిపాళెం : గ్రామాల్లో నిర్వహించే రెవెన్యూ సదస్సులను సద్వినియోగం చేసుకోవాలని తహసీల్దార్ సుధీర్ అన్నారు. మండలంలోని ఇస్కపాళెంలో గురువారం రెవెన్యూ సదస్సును ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ భూ సమస్యలను పరిష్కరించుకునేందుకు ఈ సదస్సులు ఉపయోగపడుతాయన్నారు. మొత్తం మూడు అర్జీలు వచ్చాయని, వీటిని త్వరగా పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటామన్నారు. కార్యక్రమంలో డిప్యూటీ తహసీల్దార్ విజయ్, వైఎస్సార్‌సీపీ నేత కోడూరు మధుసూదన్‌రెడ్డి, సచివాలయ ఉద్యోగులు పాల్గొన్నారు.

సూరాయపాళెంలో..

పొదలకూరు : మండలంలోని సూరాయపాళెం గ్రామ సచివాలయంలో తహసీల్దార్ ఐఎస్ ప్రసాద్ గురువారం రెవెన్యూ సదస్సును నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామస్తులు తహసీల్దార్‌కు వినతిపత్రాలను అందజేశారు. గ్రామంలో చాలా ఏళ్ల క్రితం పంపిణీ చేసిన సీజేఎఫ్ఎస్ పట్టాలను రద్దు చేసి తిరిగి పట్టాలు ఇవ్వలేదని గ్రామస్తులు తెలియజేశారు. రైతులు సాగు చేసుకుంటున్న ప్రభుత్వ భూములకు పట్టాలను ఇవ్వాల్సిందిగా విజ్ఞప్తి చేశారు. ఈ సందర్భంగా తహసీల్దార్ మాట్లాడుతూ చెరువు, కుంట, వాగు, నది పరీవాహక పొరంబోకు భూములకు పట్టాలు ఇవ్వలేమన్నారు. ఉప సర్పంచ్ డి.వెంకటరమణారెడ్డి, మాజీ సర్పంచ్ ఎం.మల్లారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

నేత్రపర్వం.. శ్రీనివాసుని కల్యాణం



విశేషాలంకరణలో స్వామి, అమ్మవార్లు

పొదలకూరు : పట్టణంలోని శ్రీనివాస లేఅవుట్లో ఉన్న లక్ష్మీ గోదాదేవి సమేత వెంకటేశ్వరస్వామి దేవస్థానంలో శ్రీనివాసుని కల్యాణం గురువారం నేత్రపర్వంగా సాగింది. మహిళా భక్తులు అధిక సంఖ్యలో విచ్చేసి కల్యాణాన్ని తిలకించారు. అనంతరం నిర్వాహకులు భక్తులకు అన్నప్రసాదాలను అందజేశారు. కార్యక్రమంలో దేవస్థానం కమిటీ బాధ్యులు వాకాటి శ్రీనివాసులురెడ్డి, ఎం.శ్యాంప్రసాద్, కొమ్మి వేణుగోపాల్, చొప్పా వెంకటేశ్వర్లు, దాసరి శ్రీనివాసులు, సన్నికంటి మురళీ పాల్గొన్నారు.

వైభవంగా వెంకటేశ్వరుని కల్యాణం

అయ్యప్పనగర్‌లో ఉన్న వెంకటేశ్వరస్వామి దేవస్థానంలో గురువారం రాత్రి స్వామివారి కల్యాణం వైభవంగా నిర్వహించారు. ఉభయకర్తలు భక్తులకు అన్నప్రసాదాలను ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో దేవస్థానం కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

పేదలకు పక్కా ఇళ్లు

- గడప గడపకు మన ప్రభుత్వంలో సమస్య గుర్తింపు
- ఎమ్మెల్యే ప్రసన్న చొరవతో పేదలకు న్యాయం



కుటుంబ యజమానికి బహుమతిని అందిస్తున్న నిరంజన్‌బాబురెడ్డి

కోవూరు: కడప జిల్లా ప్రొద్దుటూరుకు చెందిన 18 సంచార జాతుల కుటుంబాల ఏడేళ్ల సమస్యకు పరిష్కారం లభించింది. వీరు పడుగుపాడు నేతాజీనగర్ పెట్రోలు బంకు సమీపంలో గత ఏడేళ్లుగా నివాసముంటున్నారు. తమకు గత ప్రభుత్వంలో ఎటువంటి న్యాయం జరగలేదని, జగనన్న ప్రభుత్వంలోనైనా న్యాయం చేయాలని వారు గతంలో గడప గడప మన ప్రభుత్వం కార్యక్రమంలో భాగంగా ఎమ్మెల్యే నల్లపరెడ్డి ప్రసన్నకుమార్‌రెడ్డికి సమస్యను వివరించారు. తక్షణమే స్పందించిన ఆయన వారిని గుర్తించి ఇళ్ల స్థలాలు కేటాయించి పక్కా గృహాలు మంజూరు చేయించారు. ప్రభుత్వం ద్వారా అందిన నిధులతో వారు వేగవంతంగా ఇళ్ల నిర్మాణాలను పూర్తి చేసుకున్నారు. ఈ ఇళ్లల్లోకి వారు గురువారం గృహప్రవేశం చేయడంతో అధికారులు, ప్రజాప్రతినిధులు వారికి అభినందనలు తెలిపారు. డీఏబీ చైర్మన్ నిరంజన్‌బాబురెడ్డి వారికి బహుమతులు కూడా అందించారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీఓ శ్రీహరి, నేతలు పన్నెం సుధాకర్, కవరగిరి ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

ఇద్దరు హెచ్‌ఎంల బదిలీ

ముత్తుకూరు : మండలంలోని రెండు జెడ్పీ హైస్కూళ్ల హెచ్‌ఎంలు గురువారం బదిలీ అయ్యారు. ముత్తుకూరు జెడ్పీ హైస్కూల్ హెచ్‌ఎంగా ఐదేళ్లకు పైగా పనిచేసిన వై.చెంచురామయ్య వావిళ్లకు బదిలీ అయ్యారు. ఈ స్థానంలో రేవూరు నుంచి చల్లా శ్రీనివాసులు రెడ్డి వచ్చి బాధ్యతలు స్వీకరించారు. అలాగే, బ్రహ్మదేవి జెడ్పీ హైస్కూల్ హెచ్‌ఎం సాయి ప్రసాద్ ఏఎస్‌పేట మండలంలోని దూబగుంటకు బదిలీ అయ్యారు. ఈ స్థానంలో చిలకలమర్రి నుంచి ఎల్.తాన్య వచ్చి బాధ్యతలు స్వీకరించారు.

కొండెక్కిన కోడిగుడ్డు



అమ్మకానికి సిద్ధంగా కోడిగుడ్లు

బుచ్చిరెడ్డిపాళెం: కోడిగుడ్డు ధరలు ఆకాశాన్ని అంటాయి. ఏకంగా రూ.7 మేర ధర ఉండటంతో సామాన్య ప్రజలు కొనేందుకు వెనుకాడుతున్నారు. మండుతున్న ఎండలకు కోళ్లు ఎక్కువగా మృతి చెందటంతో వాటి ప్రభావం గుడ్ల మీద పడింది. దీనివల్ల ధరలు అమాంతం పెరిగింది. నలుగురు ఉన్న కుటుంబంలో ఒక పూట కోడిగుడ్డు కూర చేసుకోవాలన్నా కనీసం రూ.50పైగా ఖర్చవుతోంది.

వీఆర్వోపై దాడి హేయం



బుచ్చిరెడ్డిపాళెం: బాలాయపల్లి మండలం రామాపురం వీఆర్వో మేకలయ్యపై కొందరు దాడి చేయడం హేయమైన చర్య అని బుచ్చిరెడ్డిపాళెం వీఆర్వోలు అన్నారు. ఈ మేరకు రెవెన్యూ కార్యాలయంలో గురువారం విలేకరుల సమావేశాన్ని నిర్వహించారు. విధి నిర్వహణలో ఉన్న మేకలయ్యపై దుండగులు కర్రలు రాళ్లతో దాడి చేయడం దారుణమన్నారు. దీనిపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. వీఆర్వోలు రామకృష్ణారెడ్డి, నారాయణరెడ్డి, కృష్ణ, భార్గవి, అనంత, రమణయ్య పాల్గొన్నారు.

విగ్రహ ప్రతిష్టోత్సవాలు ప్రారంభం



ఉత్సవాల్లో భాగంగా జరుపుతున్న హోమాలు

కొడవలూరు: మండలంలోని నాయుడుపాళెంలో నూతనంగా నిర్మించిన కోదండరామస్వామి ఆలయంలో విగ్రహ ప్రతిష్ట ఉత్సవాలు గురువారం వేడుకగా ప్రారంభమయ్యాయి. ఈ సందర్భంగా విశేష పూజలతో పాటు గరుడ పతాక ఆవిష్కరణ, మంత్ర హోమం నిర్వహించారు. ఉదయం గోపూజ, విష్వక్సేన ఆరాధన, వివిధ హోమాలు జరిగాయి. కార్యక్రమంలో ఆలయ నిర్మాణ దాతలు మారంరెడ్డి నారసింహారెడ్డి, సుజాతమ్మ, శేషురెడ్డి, వర్షిణి, విష్ణుప్రియ తదితరులు పాల్గొన్నారు.

సముద్ర జలాలను సంరక్షించాలి



ప్రతిజ్ఞ చేస్తున్న పోర్టు ఉద్యోగులు, కార్మికులు

- పోర్టు సీఓఓ సంజయ్

ముత్తుకూరు : సముద్ర జలాలు కలుషితం కాకుండా సంరక్షించాల్సిన బాధ్యత ప్రతి ఉద్యోగి, కార్మికుడిపై ఉందని అదానీ కృష్ణపట్నం పోర్టు సీఓఓ సంజయ్ కోత అన్నారు. ఇంటర్నేషనల్ ఓషన్ డే సందర్భంగా గురువారం పోర్టులో జరిగిన కార్యక్రమంలో సముద్ర జలాలను సంరక్షిస్తామంటూ ఉద్యోగుల చేత ఆయన ప్రతిజ్ఞ చేయించారు. అనంతరం ప్రసంగించారు. పోర్టు పరిధిలోని సముద్ర జలాలు ఉన్నత ప్రమాణాలు కలిగి ఉండేలా చర్యలు తీసుకోవాలన్నారు. సముద్ర జలాల పరిరక్షణకు పోర్టు కట్టుబడి ఉందన్నారు. ఈ సందర్భంగా ఐదు ఫైబర్ బోట్ల ద్వారా సముద్ర జలాల్లోని చెత్త తొలగించే కార్యక్రమానికి జెండా ఊపి ప్రారంభించారు. అడ్మిన్ హెడ్ గణేష్‌శర్మ, సెక్యూరిటీ హెడ్ వెంకటేష్ భాస్కరన్, పోర్టు కంట్రోల్ ఇన్‌చార్జి జునీద్, మనోహర్‌బాబు, మనీష్‌దావే తదతరులు పాల్గొన్నారు.

న్యాయం చేయాలని వినతి



వినతి పత్రం అందజేస్తున్న జేఏసీ నేతలు

వెంకటాచలం: వీఆర్ న్యాయ కళాశాల విద్యార్థి అల్తాఫ్‌కు న్యాయం చేయాలని విద్యార్థి జేఏసీ ఆధ్వర్యంలో గురువారం వీఎస్‌యూలో రిజిస్ట్రార్ డాక్టర్ పి.రామచంద్రారెడ్డికి వినతి పత్రం అందజేశారు. అల్తాఫ్ అన్ని రికార్డులు అందించినా ఇంటర్నల్స్‌లో సున్నా మార్కులు వేయడంతో రెండు సబ్జెక్టులు పాసయ్యే అవకాశం ఉన్నా నష్టపోయాడని వినతి పత్రంలో పేర్కొన్నారు. వీఎస్‌యూ వైస్ చాన్సలర్, కంట్రోలర్ ఆఫ్ ఎగ్జామినేషన్‌తో చర్చించి నిర్ణయం తీసుకుంటామని ఈసందర్భంగా రిజిస్ట్రార్ రామచంద్రారెడ్డి తెలియజేశారు. జేఏసీ నేతలు ఆదిత్యసాయి, అల్తాఫ్, ప్రేమ్, సద్దాం, నవాజ్ తదితరులు పాల్గొన్నారు.

పథకాలను సద్వినియోగం చేసుకోవాలి



మాట్లాడుతున్న ట్రైనీ కలెక్టర్ మహేష్

కోవూరు: రాష్ట్ర ప్రభుత్వం డీఆర్‌డీఏ ద్వారా అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను సద్వినియోగం చేసుకోవాలని ట్రైనీ కలెక్టర్ ఎ.మహేష్ అన్నారు. మండలంలోని పలు ప్రాంతాల్లో డీఆర్‌డీఏ ద్వారా లబ్ధిపొందిన వారిని గురువారం ఆయన కలిశారు. పథకాల అమలు గురించి అడిగి తెలుసుకున్నారు. అనంతరం గుమ్మలదిబ్బ బీసీ కాలనీలో జగనన్న కాలనీని పరిశీలించారు. ఇళ్ల నిర్మాణాల పురోగతిపై ఆరాతీశారు. కొత్తూరు దళితవాడలో ఉన్న అంగన్‌వాడీ కేంద్రాన్ని పరిశీలించారు.

పోలీస్‌స్టేషన్‌లో అసిస్టెంట్ కలెక్టర్ సందర్శన

అసిస్టెంట్ కలెక్టర్ జి.విద్యాధరి కోవూరు పోలీస్‌స్టేషన్‌ను గురువారం సందర్శించారు. శిక్షణలో భాగంగా పలు రికార్డులను పరిశీలించారు. కోవూరు సీఐ రామకృష్ణారెడ్డి, ఎస్సై వెంకటేశ్వరరావుతో పలు విషయాలపై చర్చించారు. ఆమె వెంట ఎస్సై రమ్య, పోలీస్ సిబ్బంది ఉన్నారు.

బ్రెయిన్ ట్యూమర్‌పై అవగాహన



మాట్లాడుతున్న న్యూరాలజిస్ట్ డాక్టర్ వైష్ణవి

వెంకటాచలం: కాకుటూరులోని విక్రమసింహపురి యూనివర్సిటీలో వీఎస్‌యూ ఎన్ఎస్ఎస్ విభాగం, మెడికవర్ హాస్పిటల్ సంయుక్తంగా గురువారం బ్రెయిన్ ట్యూమర్‌పై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. బ్రెయిన్ ట్యూమర్ దినోత్సవం సందర్భంగా న్యూరాలజిస్ట్ డాక్టర్ ఎ.వైష్ణవి ట్యూమర్ లక్షణాలు, ట్యూమర్‌లో రకాలు, నిర్ధారణ పద్ధతుల గురించి వివరించారు. ప్రతిఒక్కరూ బ్రెయిన్ ట్యూమర్ గురించి పూర్తిగా తెలుసుకోవాల్సిన అవసరం ఉందన్నారు. ఈ కార్యక్రమంలో వీఎస్‌యూ రిజిస్ట్రార్ డాక్టర్ పి.రామచంద్రారెడ్డి, డాక్టర్ విజయ, డాక్టర్ ఉదయ్‌శంకర్, డాక్టర్ సునీత తదితరులు పాల్గొన్నారు.